శుక్రవారం 7.08.2026

# వాస్తవం

డెయిలీ.కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## పంద్రాగస్టు నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**సీఎం చేతుల మీదుగా సంగారెడ్డిలో ప్రారంభం**

**రాష్ట్రవ్యాప్తంగా 1.05కోట్ల కొత్త రేషన్ కార్డులు సిద్ధం**

**మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**



10



# డిజిటల్ పేమెంట్స్ వాత ఇక యూపీఐ చార్జీల మోత



## జీరో ఎండీఆర్ పాలసీకి కేంద్రంలోని మోదీ సర్కార్ స్వస్తి

- బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- లావాదేవీ 2 వేలు దాటితే భారమే
- అంతిమంగా కస్టమర్లపైనే భారం..
- నిపుణుల వెల్లడి

10లో..

పాల ప్యాకెట్ కొనుగోలు నుంచి నిత్యం ఎలాంటి పేమెంట్స్ అయినా ఫోన్ ద్వారానే చెల్లిస్తున్నాం. ఒక్క రూపాయి నుంచి లక్షల రూపాయల వరకూ యూపీఐ ద్వారానే లావాదేవీలు నిర్వహిస్తున్నాం. దీని కోసం గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, భీమ్ తదితర యాప్స్ వాడకం జీవితంలో ఒక భాగంగా మారింది. అయితే, మొన్నటి వరకూ ఫ్రీగా జరిగిన ఈ లావాదేవీలు ఇకపై అలా ఉండబోవు. ఇన్నాళ్లూ డిజిటల్ పేమెంట్స్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ వచ్చిన మోదీ సర్కార్.. ఇక చార్జీల వాతకు తెరతీసింది. యూపీఐ లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)'ను విధిస్తూ రూపొందించిన యూపీఐ ట్రాన్సాక్షన్ చార్జీల బిల్లుకు గురువారం లోక్‌సభ ఆమోదం తెలిపింది.

లోక్‌సభలో ఆమోదం పొందిన తాజా బిల్లు ప్రకారం.. ఎంత మేరకు ఎండీఆర్ చార్జీలు విధిస్తారన్న దానిపై ఇప్పుడే స్పష్టత లేకపోయినప్పటికీ, రూ.2 వేలకు మించిన లావాదేవీలపై 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్‌ను విధించే అవకాశం ఉన్నదని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఈ చార్జీల భారం వ్యాపారులపైనే ఉండనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నప్పటికీ, అంతిమంగా కొనుగోలుదారులపైనే భారం పడుతుందన్న వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఉదాహరణకు.. ఓ కస్టమర్ రూ.2 వేల విలువైన వస్తువును ఓ షాపులో కొన్నాడు అనుకొందాం. రూపే డెబిట్ కార్డు లేదా యూపీఐ యాప్ ద్వారా రుసుం చెల్లించాడు. జీరో ఎండీఆర్ పాలసీ వల్ల ఇప్పటివరకూ ఈ పేమెంట్‌ను కస్టమర్‌కు చెందిన బ్యాంక్, వ్యాపారికి చెందిన బ్యాంక్‌లతోపాటు పీఎస్పీలు ఉచితంగానే ప్రాసెస్ చేసేవి. దీనివల్ల సదరు వస్తువును అమ్మిన వ్యాపారి ఖాతాలో రూ.2,000 జమ అయ్యేది. అయితే జీరో ఎండీఆర్ పాలసీ రద్దు కాబోతున్న నేపథ్యంలో.. కస్టమర్ పేమెంట్‌ను ప్రాసెస్ చేసినందుకు బ్యాంకులు, పీఎస్పీలు వ్యాపారుల దగ్గర ఇకపై ఛార్జీలను వసూలు చేస్తాయి.

## నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల అంశం

**మరో 176 కాలేజీలపై విచారణ**



**హైదరాబాద్, ఆగస్టు 6:** ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. విచారణలో భాగంగా ఒకే తరహాలో నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలు తయారు చేసినట్లు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్‌ఓసీలు సమర్పించినట్లు గుర్తించిన హైడ్రా.. మరో 176 కాలేజీలపై విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాల అనుమతుల కోసం ఫైర్ ఎన్‌ఓసీలను హైడ్రా ఇస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్‌ఓసీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్‌ఓసీల కోసం హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీలు సృష్టించి ఇంటర్ బోర్డుకు కాలేజీలు సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలను కాలేజీ యాజమాన్యాలు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్‌వోసీల కోసం జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఫైర్ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా నివేదిక, పోలీసుల విచారణలో బయట పడ్డ అంశాలను ఆధారంగా చేసుకుని కాలేజీ యజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## రేవంత్‌కు, నాకు గ్యాప్ లేదు

**రోజూ అన్ని విషయాలు చర్చిస్తాం**

**హరీశ్‌ను అవమానించలేదు.. లేఖలపై కోర్టులోనే తేల్చుకుంటం**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్**




**హైదరాబాద్, ఆగస్టు 6 :** సీఎం రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని, ఇద్దరి మధ్య మంచి సఖ్యతే ఉన్నదని, దొంగచాటున ఫిర్యాదులు చేసుకొనే అవకాశం కాంగ్రెస్‌లో లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య ఏమున్నా ముఖంపైనే మాట్లాడుకుంటామని, బయట జరుగుతున్న అన్ని విషయాలను చర్చించుకుంటామని తెలిపారు. రేవంత్‌రెడ్డి.. తమ పార్టీ ముఖ్యమంత్రి అని, ఆయన, తాను రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని, బుధవారం కూడా మాట్లాడుకున్నామని చెప్పారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాటలు నీటి మూటలని, తన ముందు బీజేపీ ఎంపీ అర్వింద్, కేంద్ర మంత్రి బండి సంజయ్ పిల్లలని పేర్కొన్నారు. కో-ఆర్డినేషన్ కమిటీలో కీలక చర్చ జరిగిందని, అంతా బహిరంగంగాగానే మాట్లాడుకున్నామని చెప్పారు. కో-ఆర్డినేషన్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశమని, ఫొటోలో చూస్తే సీడబ్లూసీ ప్రత్యేక ఆహ్వానితుడి హోదాలో పాల్గొన్న వంశీచంద్‌రెడ్డి మధ్యలో కూర్చున్నట్టు అనిపిస్తున్నదని, ప్రొటోకాల్ ప్రకారం మీనాక్షీ నటరాజన్ సమీక్ష నిర్వహించారని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావును తాను కించపరచలేదని, ఆయనపై తప్పుడు ప్రచారం చేయలేదని తెలిపారు. హరీశ్‌రావు లీగల్ నోటీసులకు భయపడమని, న్యాయస్థానంలోనే కొట్లాడుతామని చెప్పారు.

## దిశ బిల్లు వెనక్కి

**కేంద్రం సూచనతో ఉపసంహరించుకున్న ఏపీ సర్కార్**

**అమరావతి, ఆగస్టు 6 :** తెలంగాణలో 2019లో ఓ వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో అప్పటి ఏపీ సీఎం జగన్ హడావుడిగా తెచ్చిన 'దిశ బిల్లు'ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ బిల్లులోని పలు నిబంధనల అమలు అసాధ్యమని అప్పట్లోనే కేంద్ర హోంశాఖ తేల్చేసింది. 'నిర్భయ' చట్టం దేశమంతా అమలవుతుండటంతో కేవలం ఏపీకే ప్రత్యేక చట్టం అవసరమా అని సందేహం వెలిబుచ్చింది. దీనికితోడు.. బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపించి.. కేంద్రం స్థాయిలో ప్రక్రియ కొనసాగుతుండగానే... ఐపీసీ, సీఆర్‌పీసీల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత తదితర చట్టాలు అమల్లోకి వచ్చాయి. మహిళలపై వేధింపులను గట్టిగా కట్టడి చేస్తూ భారతీయ న్యాయ సంహితలో కఠిన నిబంధనలు ఉన్నాయి. వీటన్నింటి నేపథ్యంలో దిశ బిల్లును వెనక్కి తీసుకోవాలని రాష్ట్రానికి కేంద్ర హోంశాఖ సూచించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో గురువారం సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది.





## జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్

**20 నెలల్లో తెలంగాణకు 150 కొత్త జీసీసీలు**

**జీసీసీలతో 1.5 లక్షల ఉద్యోగాల కల్పన**

**రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఆగస్టు 6 :** తెలంగాణకు 150 కొత్త జీసీసీలు 20 నెలల్లో రానున్నాయని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. జీసీసీలతో 1.5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం జేఎల్‌ఎల్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. హైదరాబాద్‌ను జీసీసీ హబ్‌గా జేఎల్‌ఎల్ ఎంచుకుందని వెల్లడించారు. జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్ అని వివరించారు. ఏఐ, డీప్‌టెక్ రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోందని ఉద్ఘాటించారు. జాతీయ జీసీసీ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతం ఉందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతమని మంత్రి తెలిపారు. హెల్త్‌కేర్, బయో టెక్, సెమీకండక్టర్లకు హైదరాబాద్ తొలి ఎంపిక అని వివరించారు. జేఎల్‌ఎల్ జీసీసీతో రెండేళ్లలో 1,600 ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులకు తెలంగాణ ఆకర్షణ కేంద్రమని వెల్లడించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీతో పెట్టుబడులకు కొత్త ఊపు వస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధితో యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో జీసీసీల విస్తరణలో వేగం పెరిగిందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

## సీనియర్లకే 60% నామినేటెడ్ పదవులు

**ఎంపికపై గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో సమీక్ష**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మహేశ్‌కుమార్ హాజరు**





**హైదరాబాద్, ఆగస్టు 6 :** మండల మాజీ అధ్యక్షులు, జిల్లా సీనియర్ నేలతకు 60% నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గత మండలాల పార్టీ అధ్యక్షులకు, జిల్లా కార్యవర్గాల్లో పనిచేసిన వారికి, అనుబంధ సంఘాల నాయకులకు, నియోజకవర్గ సీనియర్ నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం మహేశ్ కుమార్ గౌడ్‌తో గాంధీభవన్‌లో భేటీ అయ్యారు. పీఏసీ ఎస్ డైరెక్టర్లు, చైర్మన్లు, పలు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించి విధివిధానాలను రూపొందించారు. ఇన్‌చార్జి మంత్రి జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గాల్లో కంటెస్టెడ్ అభ్యర్థులు సీనియర్ నాయకులతో సమావేశమై, సమన్వయంతో ఆశావహుల నివేదిక రూపొందించాలని నిర్ణయించారు.

# అనుమతులు లేని నైన్ ఎడ్యుకేషన్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్**

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ సంయుక్త కార్యదర్శి వసుంధరకి ఫిర్యాదు**



**వాస్తవం : మేడిపల్లి:**

మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా నడుస్తున్న నైన్ ఎడ్యుకేషన్ కళాశాలపై తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం తీరును, జిల్లా విద్యాశాఖ అధికారుల అలసత్వాన్ని తీవ్రంగా ఎండగట్టారు.ప్రభుత్వ నిబంధనలు, ఇంటర్ బోర్డు గుర్తింపు లేకుండా నైన్ ఎడ్యుకేషన్ కళాశాల యాజమాన్యం డేస్కాలర్ మరియు రెసిడెన్షియల్ పేరుతో తరగతులు నిర్వహిస్తూ, దాదాపు 300 మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది.ఈ అక్రమ కళాశాల గురించి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారికి అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి తక్షణమే స్పందించి, బోడుప్పల్‌లోని నైన్ ఎడ్యుకేషన్ కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అక్కడ అభ్యసిస్తున్న విద్యార్థుల విద్యా సంవత్సరం దెబ్బతినకుండా వారి భవిష్యత్తును కాపాడాలి.అనుమతులు లేకుండా యథేచ్ఛగా నడుస్తున్న ఇలాంటి అక్రమ కళాశాలలపై విద్యాశాఖ వెంటనే చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్,ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు కృష్ణ,రాము, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యం

**రేపాక సర్పంచ్ కాత మల్లేశం**



**వాస్తవం : ఇల్లంతకుంట**

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం అని రేపాక సర్పంచ్ కాత మల్లేశం అన్నారు. గురువారం ఇల్లంతకుంట మండలం రేపాక అంగన్వాడీ కేంద్రం –3లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లి పాలు అందించడం ఎంతో ముఖ్యమని,తల్లి పాలలో శిశువుకు రోగానిరోధక శక్తినిచ్చే పోషకాలు ఉంటాయని ఆయన తెలిపారు. పుట్టినప్పటి నుండి శిశువుకు మొదటి ఆరు నెల్ల వరకు తల్లి పాలు అవసరమని, తల్లి పాలతోనే శిశువులో ఆరోగ్యకరమైన ఎదుగుదల ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, అంగన్వాడి టీచర్ మీసాల హంసలీల, ఏఎన్ ఎం జయ, ఆశా కార్యకర్త పద్మ, తల్లులు పాల్గొన్నారు.

# యువతకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమే

**శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు**

**వాస్తవం : శేర్లింగంపల్లి**



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి మరో ముందడుగు పడింది. ఈరోజు తారా నగర్ పలువురు యువకులు శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవి యాదవ్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.నేటి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చినా, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ ఆలస్యం కావడం, నిరుద్యోగ యువతలో పెరుగుతున్న ఆందోళన, భవిష్యత్తుపై నెల కొన్న అనిశ్చితి యువతను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. యువతకు ఉపాధి, అవకాశాలు, అభి వృద్ధి దిశగా స్పష్టమైన కార్యాచరణతో పనిచేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విశ్వాసం యువతలో మరింత బలపడుతోందని అన్నారు. అందుకే యువత స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీ వైపు ఆకర్షితులవుతూ, పార్టీ సిద్ధాంతాలు మరియు నాయకత్వంపై విశ్వాసంతో పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు.సంజు రాథోడ్, అభిరాం, విశాల్, సాయి చరణ్, వెంకటేష్, బిషత్, ఆవేజ్, అంజి, సాయి, మరియు ఇతరులు పార్టీలో చేరారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన సమయంలో ఉద్యమ స్ఫూర్తిని సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేస్తూ, తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో చైతన్యంగా మలచడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.సమాజం పట్ల నిబద్ధతతో అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నా భూమిని నాకు ఇప్పియ్యండి

**మంత్రి వివేక్‌ని వేడుకున్న తన్వీర్ బేగం**

**వాస్తవం : చెన్నూర్ ఆర్సి**

నా పేరుమీద పట్టా పాస్ బుక్ నెంబర్158 గల భూమిని నాకిప్పియ్యండి సార్ అని తన్వీర్ బేగం అనే మహిళ వేడుకున్నది. ఈ వేడుకోలుకు మంత్రి స్పందించి ఆ మహిళకు న్యాయం చేయాల్సిందిగా మంత్రి వివేక్ ఒక లేఖను అందజేశారు. అయినా పోలీసులు,రెవెన్యూ అధికారులు స్పందించకుండా తనకు అన్యాయం చేస్తున్నారని సదరు మహిళ ఆవేదనతో చెప్పింది.ఈ వ్యవహారానికి సంబంధించి ఆ మహిళ మాటల్లోనే.. తనకు న్యాయం చేయాల్సిందిగా మంత్రి చెప్పినా నా ఫిర్యాదును తీసుకోకుండా రామ్ రెడ్డి చెప్పినట్టు విని తనపైనే తప్పుడు కేసునమోదు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. అక్కడ నుంచి కోటపల్లి ఎమ్మార్వో, దగ్గరికి పోయి చెప్పడం జరిగింది. ఎమ్మార్వో కూడా పట్టించుకోలేదు. ఎమ్మార్వో కూడా మినిస్టర్ మాటని లెక్క చేయలే కుండ ఎమ్మార్వో కూడా కొండం పేట రామ్ రెడ్డి, తన దగ్గర బంధువులకు మేడ పార్వతి, వాళ్లుకూ సపోర్ట్ చేశాడు. ఇది మా భూమి. నీది ఏమి లేదు ఇక్కడికి ఇంకొక్కసారి వచ్చినట్టయితే చెప్పుకోలేని బూతులు తిట్టుతూ నా మీదికి గొడవకు దిగారు. కొండయ్య, సంపత్ రెడ్డి, వీళ్లు నా పైన గొడవ దిగి ఆడదాన్ని అని చూడకుండా నానా బూతులు తిడుతూ నన్ను నెట్టు వేశారు అనుచరులతో ఒక మైనార్టీ ఆమెపై దౌర్జన్యానికి దిగారన్నారు.తన్వీర్ బేగం పేరుమీద పట్ట పాసుబుక్కులు కొత్తది ఉన్నా కూడా నా భూమి అని అతని అనుచరులతో నెట్టేస్తే బురదలో పడిపోయానన్నారు..కొట్టటానికి ప్రయత్నించారు.నీవు కొండం పేట రావద్దు నీది భూమి కాదు మాది భూమి నీది ఏమీ



లేదు. అని నా మీదికి దాడికి దిగారని ఆమె చెబుతోంది ఆమెకు అవసరం ఉండి. ఆ భూమిని వేరే వాళ్లకు అమ్ముకొని వాళ్లకు పట్టా చేయించి ఇవ్వడం. జరిగింది వారిని కూడా భూమిని సాగు చేసుకోనివ్వకుండా. అడ్డుపడుతున్నారు. వలకు పట్టేలేని భూమి మీద ఇంత దౌర్జన్యం పాల్పడుతున్నాడు. రామ్ రెడ్డి కొడంపేట, వీళ్ళ నుంచి నాకు ప్రాణహాని ఉంది నన్ను చంపేస్తా అని అంటున్నారు. నాకు న్యాయం చేయండి అని వేడుకుంటోంది.


జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


# రహదారి విస్తరణ నిర్మాణంలో బాధితుల ఇండ్లు ఇప్పుడే కూల్చొద్దు

### హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ

**వాస్తవం : చిగురుమామిడి**

కొత్తపల్లి హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి విస్తరణ నిర్మాణ పనులలో చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన బాధితుల విషయంలో బుధవారం తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నాలుగు వరుసల రహదారి విస్తరణ అంశంపై దాఖలైన రిట్ పిటిషన్లపై బాధితులకు స్టేటస్-కో యధాత స్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ హైకోర్టు ఉపశమనం కల్పించింది.సుం దరగిరి గ్రామానికి చెందిన ప్రధాన పిటిషనర్ కందుకూరి లక్ష్మణాచారి,కక్కర్ల బాలయ్య,కెమ్మసాగరం వెంకటయ్య,ఓరుగంటి భారతీ దేవి,వంతడుపుల మల్లయ్య,పిట్టల రమేష్,గైని శ్రీనివాస్,బోల్లబతిని రాజేశం,మొలుగురి వెంకటాద్రి,వంతడుపుల వినయ్, సిలుమోజు యశోదలు 11 మంది గ్రామస్తులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై ఈ ఆగస్టు నెల 4వ తేదీ బుధవారం రోజున విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరపల్లి నంద రోడ్డు నిర్మాణ పనులలో నష్టపోతున్న 11 మంది బాధితులకు చెందిన ఇండ్లు భూములకు ప్రస్తుతం ఉన్న పరిస్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు స్టేటస్-కో జారీ చేశారు.దీంతో పిటిషన్ బాధితులకు హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది.కోర్టులో బాధితుల వాదనలను స్వీకరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి,సర్పంచుకి ఇండ్ల కూల్చివేతపై ఎలాంటి అధికారాలు ఉన్నాయని గ్రామ ప్రజలకు నోటీసులు జారీ చేశారని ప్రశ్నించారు.అధికారులు చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించకుండా తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా ,భవిష్యత్తులో 4,6 వరుసల రహదారి నిర్మాణం బైపాస్ ద్వారా రోడ్డు నిర్మిస్తే బాగుంటదనే ప్రజాభిప్రాయాలను ఆలోచించకుండా నష్టపరిహారం చెల్లించకుండానే రహదారి విస్తరణ పేరుతో తమ ఇండ్లు భూములపై చర్యలకు సిద్ధమవుతున్నారని బాధితులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.పిటిషనర్ల తరపున న్యాయవాదులు వి.వెంకట సుబ్రహ్మణ్యం,దాసరి శ్రీనివాస్ రెడ్డిలు బాధితుల పక్షాన వాదనలు వినిపించారు.దీనిపై స్పందించిన హైకోర్టు తదుపరి విచారణ వరకు బాధితుల ఇండ్లు కూల్చివేయడం,భూముల స్వాధీనం లేదా ఇతర జోక్య చర్యలు చేపట్టవద్దని స్టేటస్-కో కొనసాగించాలని ఆదేశించింది.ఈ కేసు తదుపరి విచారణ ఈ ఆగస్టు నెల 11వ తారీఖుకు వాయిదా పడింది.ఇక నాలుగు వరసల రహదారి నిర్మాణ విస్తరణ పనుల అంశంపై పిటిషనర్లుకు హైకోర్టులో స్టేటస్-కో ఉత్తర్వులు జారీ చేయడం హుస్నాబాద్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.చట్టబద్ధమైన ప్రక్రియ ప్రజల అభ్యంతరాల పరిశీలన,భవిష్యత్తులో4,6 వరుసల రోడ్డుకు,నేషనల్ రోడ్డుకు,గ్రీన్ ఫీల్డ్ రహదారికి బైపాస్ రోడ్డు అనుకూలమని ప్రతిపాదన ఉత్తర తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తులో మంచి ప్రదాన రాష్ట్ర జాతీయ రహదారి నిర్మించాలంటే బైపాస్ రోడ్డు ద్వారానే నిర్మించాలని తగిన నష్టపరిహారం వంటి పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని హైకోర్టు మధ్యంతర ఉత్తరలు స్పష్టం చేస్తున్నాయని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నారు.



**HIGH COURT FOR THE STATE OF TELANGANA : HYDERABAD**

**MAIN CASE NO: W.P.No.25459 OF 2026**

**PROCEEDING SHEET**

| SL. NO | DATE | ORDER | OFFICE NOTE |
|---|---|---|---|
| | 04.08.2026 | SN,J<br>**W.P.No.25459 OF 2026**<br>Heard Sri Dasari Srinivas Reddy, learned counsel appearing on behalf of the petitioners, learned Assistant Government Pleader for Roads and Building appearing on behalf of the respondent Nos.1 & 2 and the learned Assistant Government Pleader for Panchayatraj appearing on behalf of respondent No.3.<br>List on 11.08.2026 in the **'MOTION LIST'**. | |

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**వాస్తవం : భూపాలపల్లి**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో అత్యంత వైభవంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని ముందుగానే ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల ఏర్పాట్లపై శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలను సమీక్షించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వేడుకలలో ప్రతి కార్యక్రమం 'మినిట్ టు మినిట్' ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన సమయానికే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీసుల గౌరవ వందనం, సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పంపిణీ, ప్రజాప్రతినిధుల పాల్గొనడం వంటి ప్రతి కార్యక్రమం ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే విధంగా అన్ని శాఖలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలు, సాధించిన పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలను స్టాళ్ల ద్వారా ప్రదర్శించి సందర్శకులకు అవగాహన కల్పించాలని సూచించారు.విద్యార్థులతో దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకునేలా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృతంగా షామియానాలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, మరుగుదొడ్ల సౌకర్యం, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య బృందాలతో ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అవసరమైన మందులు, అంబులెన్స్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అలాగే ఎలాంటి ప్రమాదాలు సంభవించినా వెంటనే స్పందించేందుకు అగ్నిమాపక శాఖ వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు అందించే ప్రయోజనాల పంపిణీకి సంబంధించిన పూర్తి జాబితాను ముందుగానే సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులను



ఎంపిక చేసి వేడుకల రోజున సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు,విశిష్ట అతిథులు,అధికారులు,ఇతర ఆహ్వానితులకు ఆహ్వాన పత్రికలను ముందుగానే పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమ నిర్వహణలో ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, చిన్నచిన్న అంశాలపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లను ప్రారంభ దశ నుంచి ముగింపు వరకు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ అన్ని పనులు గడువులోగా పూర్తయ్యేలా చూడాలని ఆర్డీఓ హరికృష్ణకు కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాకు ఆదర్శంగా నిలిచే విధంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆటో బ్యాటరీ చోరీ కేసులో నలుగురు అరెస్ట్

### ఆటో బ్యాటరీ చోరీ కేసు లో నలుగురు అరెస్ట్..వెల్లడించిన సీఐ

**వాస్తవం : అందోల్**

ఆటో బ్యాటరీ చోరీ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జోగిపేట సీఐ అనిల్ కుమార్ తెలిపారు. ఆయన జోగిపేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల అందోల్ మండలం దాకూర్ గ్రామంలో పార్కు చేసిన ఆటో టీఎస్ 07 యూఏ 7236 అనే నెంబర్ గల ఆటోను పార్క్ చేసిన స్థలం నుండి దొంగలించడానికి ప్రయత్నించిన నలుగురు నిందితులకు అది సాధ్యం కాకపోవడంతో అందులోని బ్యాటరీని దొంగిలించి తీసుకెళ్లినట్టు బాధితుడు షేక్ మహబూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చేపట్టగా ఉదయం వెహికల్ చెకప్‌లో నలుగురు నిందితులు గౌస్ పాష అంబర్పేట్, మహ్మద్ షఫీ పలకనుమా, మమ్మద్ జమాలుద్దీన్, రంజోల్. బాబి మైనుద్దీన్ భూత్పూర్, లను చెకింగ్ చేస్తుండగా ఇటీవల దొంగిలించిన బ్యాటరీ దొంగలు బయటపడ్డారని సిఐ తెలిపారు. వీరిని అరెస్టు చేసే రిమాండ్‌కు తరలించినట్టు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.ఈ సమావేశంలో ఎస్సై గిరి



శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజుల బకాయిలపై బీజేపీ యువ మోర్చా ఆందోళన

వాస్తవం : ఎల్లారెడ్డిపేట

భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి ఆదేశాలను సారం బీజేవైఎం ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు ఇంటర్, డిగ్రీ కళాశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా సుమారు 40 లక్షల మంది విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. దాదాపు రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేయడంతో పాటు స్థానిక ఎమ్మెల్యేల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయాకర్ రెడ్డి, మారవేణి రంజిత్, చరణ్ గౌడ్, చందు, సాయి, రోహిత్, రమేష్, చింటూ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ నగర్‌లో

## డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

**రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం**

**పనులను పరిశీలించిన మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్**



మేడిపల్లి : వాస్తవం

మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ అంబేద్కర్ నగర్ ప్రాంతంలో చాలాకాలంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ. 50 లక్షల ప్రభుత్వ నిధులను మంజూరు చేయించామని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంబేద్కర్ నగర్‌లో డ్రైనేజీ లీకేజీ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 50 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఈ పనులు పూర్తయిన తర్వాత పారిశుద్ధ్య సమస్యలు పూర్తిగా తొలగిపోయి స్థానికులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని అజయ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, దానగాళ్ల యాదగిరి, స్థానిక నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

# ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి

వాస్తవం ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయంలో పాఠశాలలో చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎల్లారెడ్డిపేట మండల బీఆర్ఎస్ శాఖ అధ్యక్షులు వరస కృష్ణ హరి, తిమ్మాపూర్ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అందే సుభాష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు, ఉద్యమానికి అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని పేర్కొన్నారు. అలాగే ప్రజల కోసం పాటను ఆయుధంగా మార్చి సామాజిక చైతన్యాన్ని కలిగించిన గద్దర్ సేవలను కొనియాడుతూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి , మాజీ జెడ్పిటిసి చీటీ లక్ష్మణరావు మరియు సర్పంచ్ ఎనుగందుల నరసింహులు ఉపసర్పంచ్ బంధారపు బాల్రెడ్డి, (మాజీ) మార్కెట్ కమిటీ చైర్మన్ ఏలుసాని మోహన్ కుమార్, పట్టణ అధ్యక్షులు ఎడ్ల సందీప్, మీసం రాజ్యం, అజ్జు, దూస శీను, నల్ల మందు బాలయ్య, బాధ రమేష్,జుబేర్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టు సంక్షేమ సంఘం
Regd 914/2015
జర్నలిస్టు సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టు హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం....
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం।। 9618616110

## తనకు ప్రాణహాని ఉందని ఎమ్మెల్యే తనయుడి ఆరోపణ

వాస్తవం : రాజేంద్రనగర్

తన తండ్రి నుండి తనకు ప్రాణహాని ఉందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తనయుడు సంతోష్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సంతోష్ గౌడ్ మీడియాకు తెలుపుతూ... శ్రేయసి అనే అమ్మాయితో ప్రేమలో ఉన్న విషయాన్ని మా తల్లిదండ్రుల వద్ద ప్రస్తావించాను. వారు సొంతంగా పెళ్లి చేసేందుకు ఒప్పుకోలేదు. అయినా మా తల్లిదండ్రుల అనుమతి తీసుకునే జులై 8న అత్తింటి వారితో కలిసి నిశ్చితార్థం చేసుకున్నాం. అప్పటి నుండి మణికొండ లో అత్తవారింట్లోనే ఉంటున్నాను. ఇన్ని రోజులుగా లేనిది బుధవారం 40 మంది దాకా వచ్చి మాపై దాడికి యత్నించారని సంతోష్ గౌడ్ ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియో సాక్ష్యాలు కూడా ఉన్నాయని చెప్పారు. పోలీసుల దగ్గరికి వెళ్లినా పట్టించుకోవడంలేదని వాపోయాడు. ప్రేమ వివాహం చేసుకోవడం తన తండ్రికి ఇష్టం లేదని అన్నారు. ఈ నేపథ్యంలోనే గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించాడు. తనకు ప్రాణహాని ఉందని, తన భార్య వాళ్ళ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.



# సింగరేణి చరిత్రలో చారిత్రక ఘట్టం

**ఒడిశా 'నైనీ' గని నుంచి తెలంగాణకు చేరిన తొలి బొగ్గు రైలు**

వాస్తవం : జైపూర్

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం ఆవిష్కృతమైంది. ఒడిశా రాష్ట్రంలోని సింగరేణికి చెందిన 'నైనీ' బొగ్గు గని నుంచి లోడ్ చేసిన తొలి బొగ్గు రైల్వే రేకు సుమారు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి (ఎస్టీపీపీ) గురువారం ఉదయం చేరుకుంది. ఇతర రాష్ట్రంలోని సంస్థ సొంత గని నుంచి తెలంగాణలోని విద్యుత్ కేంద్రానికి బొగ్గు రవాణా కావడం సంస్థ చరిత్రలోనే ఇదే తొలిసారి. దీంతో ఎస్టీపీపీ ప్రాంగణంలో సింగరేణి అధికారులు, ఉద్యోగులు పండుగ వాతావరణంలో సంబరాలు జరుపుకున్నారు. ?ఈ చారిత్రాత్మక విజయంపై విదేశీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో సందేశం ద్వారా సింగరేణి యాజమాన్యం, అధికారులు, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికే ప్రజా ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో సింగరేణి భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. సింగరేణిని కేవలం తెలంగాణకే పరిమితం చేయకుండా ఇతర రాష్ట్రాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ కృషి చేస్తోందని వెల్లడించారు. క్రిటికల్, రేర్ ఎర్త్ మినరల్స్ రంగాల్లోనూ సంస్థను ముందుకు తీసుకెళ్తామని, ఇటీవల సాధించిన తాడిచెర్ల-2, మణుగూరు డిప్‌సైడ్ బ్లాకులు ఇందుకు నిదర్శనమని చెప్పారు. ?నైనీ సమీపంలోని హిందోల్ రైల్వే సైడింగ్ నుంచి బయలుదేరిన ఈ తొలి రైల్వే రేకులో 59 వేగన్ల ద్వారా సుమారు 4,000 టన్నుల జి-10 గ్రేడ్ బొగ్గు తెలంగాణకు చేరింది. ఈ రవాణా ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన తెలంగాణ, ఒడిశా ప్రభుత్వాలకు, భారతీయ రైల్వే శాఖకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్టీపీపీకి చేరుకున్న బొగ్గు రైలుకు సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, ఎం. తిరుమలరావు ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం కోల్ యార్డులో అన్‌లోడింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ?రాష్ట్ర విద్యుత్ అవసరాలను నెరవేర్చడంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోందని, ఇందులో భాగంగానే ప్రస్తుతం మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ యూనిట్ నిర్మాణం వేగంగా జరుగుతోందని డైరెక్టర్ ఎం. తిరుమలరావు తెలిపారు. రాబోయే రోజుల్లో నైనీ గని నుంచి నిరంతరాయంగా బొగ్గు సరఫరా కావడం వల్ల రాష్ట్ర విద్యుత్ ప్రాజెక్టులకు ఇంధన భద్రత మరింత బలోపేతం కానుంది. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిరంజీవి, జనరల్ మేనేజర్ నర్సింహారావు, కార్మిక సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# 'బద్లావ్ జరూరి హై' మార్పుకావాలి

**కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసించండి**

**ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్రలు**

**సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ గోడపత్రిక విడుదల**

**మేడిపల్లి : వాస్తవం**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ఇందిరా నగర్ కాలనీలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడటం బోడుప్పల్ సర్కిల్ ఇంద్రానగర్ కాలనీలో పాదయాత్ర తో ప్రతి ఇంటికి వెళ్లి వారు పడుతున్న సమస్యలను తెలుసుకోవడం, కేంద్ర ప్రభుత్వం ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలి, సార్వత్రిక విద్య, ఆరోగ్యం అందుబాటులోకి తేవాలి,ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలి,మహిళా రిజర్వేషన్ను తక్షణం అమలు చేయాలి, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి, కార్మికుల హక్కులను పరిరక్షించాలి,బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి,దళిత ఆదివాసీలపై అకృత్యాలను, దాడులను నిలిపివేయాలి. నేడు భారతదేశం ఒక కీలకమైన మలుపులో నిలిచి ఉంది. నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ దశాబ్దం క్రమంగా ఆందోళన, నిరాశ పెరుగుతున్న కష్టాలకు దారితీసింది. ఎన్నికల సందర్భంగా బిజెపి అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం, సుపరిపాలన మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసిందని . కానీ దానికి బదులుగా, దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం, భరించలేని ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల), విస్తరిస్తున్న అసమానతలు, బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, కుచించుకుపోతున్న ప్రజాస్వామ్యం పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది . అయినప్పటికీ మోదీ ప్రభుత్వం నుండి ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలని కోరినప్పుడల్లా, ఈ చర్చను ఇతర అంశాల వైపులనకు మళ్లిస్తున్నారని . సామాన్య పౌరుల రోజువారీ సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, బిజెపి,ఆరెస్సెస్ పదేపదే మతపరమైన ధ్రువీకరణ, మానసిక విజ్ఞప్తులు సృష్టించబడిన వివాదాల వైపు మొగ్గు చూపుతున్నాయని జవాబుదారీతనం నుండి తప్పించుకోవడానికి మతాన్ని వాడుకుంటున్నారు. వైఫల్యాలను దాచడానికి ద్వేషాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుండి దృష్టిని మరల్చడానికి విభజనను ప్రోత్సహిస్తున్నారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కే ప్రమీల, బి కే యం యు మండల కార్యదర్శి , అధ్యక్షులు కే మహాలక్ష్మి , భూతం ఐలయ్య సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సరిత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయం

**వాస్తవం : తంగళ్ళపల్లి**




కార్పొరేట్ బిజెపి పాలనకు వ్యతిరేకంగా సిపిఐ మండల కార్యదర్శి సోమ నాగరాజు ఆధ్వర్యంలో పాదయాత్ర.దేశ సంపదను కొద్దిపాటి కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడు పెడుతూ సామాన్య ప్రజలపై ధరల భారం నిరుద్యోగం ప్రైవేటీకరణ సంక్షేమ పథకాల కోతలతో బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని సిపిఐ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా సమితి ఆధ్వర్యంలో నేడు తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపూర్ శివారులోకల అమరుడు సింగిరెడ్డి భూపతి రెడ్డి స్థూపానికి పూలమాలవేసి పాదయాత్రలను ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన విద్య వైద్యం ఉపాధి వంటి మౌలిక హక్కులను కూడా వ్యాపార వస్తువులుగా మార్చడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనం అని పేర్కొన్నారు కార్మికులు రైతులు యువత విద్యార్థులు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజల కష్టాలపై లాభాలు అర్జించే కార్పొరేట్ అనుకూల విధానాలను సిపిఐ ఎట్టి పరిస్థితిలోనూ సహించబోదని స్పష్టం చేశారు ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ఒత్తిడి తెచ్చే లక్ష్యంతో నీటి నుంచి ఆగస్టు 14 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాదయాత్రలు ప్రారంభిస్తున్నామని ప్రకటించారు నిత్యవసర వస్తువుల ధరలునియంత్రణ ప్రభుత్వ విద్య వైద్యం రంగాలలో బలోపేతం ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ మహిళల భద్రత కార్మిక రైతు హక్కుల సంరక్షణ రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ పాదయాత్రలు సాగుతాయని అన్నారు.

# బోనాలు వేడుకల్లో విషాదం ప్లే స్కూల్ విద్యార్థి మృతి

**స్కూల్ యజమాన్యం నిర్లక్ష్యంతో బాలుడు మృతి**

**వాస్తవం : పటాన్ చెరు**



తెల్లాపూర్‌లో డివిజన్ పరిధిలోని ప్లే స్కూల్‌లో చదువుతున్న ఆరేళ్ల షణ్ముక్ చెరువులో పడి మృతి చెందాడు. పాఠశాలలో బోనాల వేడుకలు జరుగుతున్న సమయంలో బాలుడు బయటకు వెళ్లినట్లు సమాచారం. కొల్లూరు పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.బాలుడి తండ్రి ఉదయ్‌కిరణ్ ఉదయం షణ్ముక్‌ను శ్రీకార ప్లే స్కూల్‌లో దింపి వెళ్లారు. ప్లే స్కూల్ చెరువుకు సమీపంలోనే ఉండడంతో, వేడుకలు జరుగుతున్న సమయంలో బాలుడు పాఠశాల ప్రాంగణం నుంచి బయటకు వెళ్లి చెరువులో పడినట్లు తెలుస్తోంది. ఆరేళ్ల బాలుడు స్కూల్ నుంచి బయటకు వెళ్లేంత వరకు సిబ్బంది గుర్తించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారుల భద్రతకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేశారా? పాఠశాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద పర్యవేక్షణ ఉందా? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. సమాచారం అందుకున్న కొల్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**విద్యార్థులకు అండగా నిలిచిన**

# ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు






**వాస్తవం : వేములవాడ**

2025 – 26 విద్యా సంవత్సరం ప్రారంభం నుండి వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనాయపల్లి పాఠశాలకి విద్యార్థుల రవాణా సౌకర్యార్థం ఆటో కి ప్రతినెల రూ12 వేల రూపాయల చొప్పున, విద్యార్థులకు షూస్, టై, బెల్ట్ వాటర్ బాటిల్స్ అందించడంలో ప్రత్యేకమైన శ్రద్ధ వహించి దాతలను ప్రోత్సహించి పాఠశాలకు ఇప్పించిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మొగిలి లక్ష్మణ్ అండగా నిలిచారు.పూర్వ సంవత్సరం లాగే విద్యార్థుల రవాణా సౌకర్యానికి ఆటో కోసం మరలా గ్రామం నుండి దాతలను సేకరించడంలో విశేష కృషి చేశారు.అలాగే స్వంత డబ్బులు వెచ్చించి పాఠశాలకి కథలు, కవితలు, పద్యాలు, లైబ్రరీ పుస్తకాలు ఇచ్చిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మొగిలి లక్ష్మణ్ ని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మొగిలి లక్ష్మణ్‌ను అభినందించారు.

**బీర్పూర్‌లో ఘనంగా**

# ఆచార్య జయశంకర్ జయంతి



**వాస్తవం : బీర్పూర్**

తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని బీర్పూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అరిగే ధర్మతేజ,టౌన్ అధ్యక్షుడు చౌదరి బాల కృష్ణ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ చేసి న సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో బసవరాజ్, మేకల రాములు, చీదరి బాలకృష్ణ, మల్లెల యోగేష్, విక్కీ, మేక రమేష్, బుమయ్య, శివకుమార్ యాదవ్, దులిగి ఎల్లప్ప పాల్గొన్నారు.

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్టుల సంక్షేమ సంఘం
Regd No. 914/2015
JSS
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH TRADE UNION
మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

## జయంతి సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్

## కలెక్టర్ రాహుల్ శర్మ ఘన నివాళి



**వాస్తవం : భూపాలపల్లి**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు, ఉద్యమానికి అందించిన సిద్ధాంత బలం, దూరదృష్టి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల్లో ఆయన నింపిన చైతన్యం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయడమే జయశంకర్ ఆశయాలకు నిజమైన నివాళి అని, తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, స్వరాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య జయశంకర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే మహనీయుడని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమం నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలవాలని, ఆయన త్యాగస్ఫూర్తిని ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'వాస్తవం' పత్రిక కథనానికి స్పందన



## పొనూర్ గ్రామంలో అధికారుల శానిటేషన్ డ్రైవ్

**జైపూర్ : వాస్తవం**

జైపూర్ మండలం పొనూర్ గ్రామ నడిబొడ్డున బర్రెల మంద పేరుకుపోయి, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారంటూ 'వాస్తవం' పత్రికలో "గ్రామ నడిబొడ్డున బర్రెల మంద ప్రజలు అల్లాడిపోతున్నారు"అనే శీర్షికతో వెలువడిన వాస్తవం పత్రికలో వచ్చిన కథనంపై అధికారులు తక్షణమే స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ వేముల సుధ బుధవారం గ్రామంలోని సమస్యాత్మక ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి వీధులు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలో ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా, వ్యాధులు వ్యాపించకుండా పరిశుభ్రత చర్యలు వేగవంతం చేశారు. సర్పంచ్ వేముల సుధ మాట్లాడుతూ, గ్రామస్తులు ఎవరూ తమ పాడి పశువులను, గేదెలను రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో వదిలిపెట్టవద్దని విజ్ఞప్తి చేశారు.పశువుల యజమానులు తప్పనిసరిగా తమ సొంత స్థలాల్లోనే వాటిని కట్టుకోవాలని, ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తూ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ శానిటేషన్ డ్రైవ్‌లో సర్పంచ్ వేముల సుధతో పాటు పంచాయతీ కార్యదర్శి ఎం.భాస్కర్,గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. పత్రికా కథనానికి వెంటనే స్పందించి వీధులను శుభ్రపరిచినందుకు సర్పంచ్‌కు,అధికారులకు పొనూర్ గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్టీపీపీలో ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు



## జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని

## సింగరేణి డైరెక్టర్ల పిలుపు

**వాస్తవం : జైపూర్**

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్  నందు తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించారు. సింగరేణి సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ ఆపరేషన్స్, ఎం. తిరుమలరావు ఈడఎం ముఖ్య అతిథులుగా హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్  చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. జయంతి వేడుకల సందర్భంగా అధికారులు, నాయకులు కలిసి ప్లాంట్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ సీహెచ్ చిరంజీవి, జీఎంలు ఎం. నరసింహరావు,సూర్యనారాయణ రాజు,కార్మిక సంఘాల నాయకులు, ఇతర అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆచార్య జయశంకర్ జీవిత విశేషాలు, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రపై ప్రత్యేక కథనం, వీడియోను కూడా ఈ సందర్భంగా ప్రదర్శించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ఘన నివాళి



**వాస్తవం : భూపాలపల్లి**

స్థానిక బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో గురువారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బాలాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో చైతన్యం చేసి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆశయాలు, ఆలోచనలు ఎల్లప్పుడూ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస చారి మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగానే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఆయన ఆలోచనలు యువతకు స్ఫూర్తినిస్తూ సమాజ సేవకు ప్రేరణగా నిలుస్తున్నాయని చెప్పారు. జయశంకర్ స్మారకార్థం జిల్లాకు ఆయన పేరు పెట్టడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

### సాయి ప్రియా నగర్ పార్కుల

# కబ్జాల తొలగింపుకు వినతిపత్రం

**అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**పార్కుల ఆక్రమణలు తొలగించి సుందరీకరణ చేపట్టాలి**

**తుంగతుర్తి రవి**

**ప్రజలకు ఆహ్లాదకరమైన పార్కులు అందించాలి**

**అధికారులకు తుంగతుర్తి రవి విజ్ఞప్తి**



**మేడిపల్లి : వాస్తవం:**

శుక్రవారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్‌వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి కలిసి సాయి ప్రియా నగర్‌లోని పార్కులపై జరుగుతున్న కబ్జాలను వెంటనే తొలగించి, మున్సిపల్ నిధులతో పార్కులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కోరారు. పార్కులను పరిరక్షించి చిన్నారులు, మహిళలు, వృద్ధులు వినియోగించుకునేలా అభివృద్ధి చేయాలని,ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని తుంగతుర్తి రవి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి,నాగరాజు,సాయిరాం గౌడ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టుల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

వాస్తవం



### ఉద్యమ కళాకారుల రాష్ట్ర కన్వీనర్

# కళా తపస్వి యెల్ల పోశెట్టి జన్మదిన వేడుకలు




**వాస్తవం : వేములవాడ**

తెలంగాణ రాష్ట్ర కళాకారుల రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి 62 వ జన్మదిన వేడుకలను వేములవాడ నృత్య కళా నికేతన్ సేవా సంస్థ జిల్లా సంస్కృతిక కళా సంస్థల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం ప్రధాన కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు.యెల్ల పోశెట్టి జన్మదిన వేడుకలకు ముందుగా శ్రీ భీమేశ్వర ఆలయం లో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనము చేసుకొని రాజన్న కోడె ముక్కును చెల్లించుకున్నారు. కళాకారులు వివిధ కళా సంస్థలు యెల్ల పోశెట్టిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం సీనియర్ జానపద గాయకులు బొడ్డు నారాయణ యెల్ల పోశెట్టి జన్మదిన సందర్భంగా వారు వ్రాసిన గీతాన్ని ఆలపించారు. కళాకారులు కళా కారునిలు వ్యాపారులు కుటుంబ సభ్యులు ఆత్మీయ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు కళా సంస్థల న్యాయ సలహాదారులు నేరెళ్ల తిరుమల్ గౌడ్, ఉత్తర తెలంగాణ కో– ఆర్డినేటర్ బొడ్డు రాములు, కళా సంస్థల సలహాదారులు బొజ్జ కనకయ్య, జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమైక్య అధ్యక్షులు ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ సంస్థ ఫౌండర్ మెంబర్ మారం ప్రవీణ్ కుమార్ (పప్పీ హీరో), శ్రావణ పెల్లి శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమ కళాకారుల విభాగం అధ్యక్షులు వారాల దేవయ్య, డాన్స్ మాస్టర్ గంగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కనపర్తి హనుమాన్లు, గుమ్మడి రాజేశం, జిల్లా కోశాధికారి బుర్రి శంకరయ్య, బొడిగె రాజు,హరీష్, వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు కళాకారులు పాల్గొన్నారు.అనంతరం కళాతపస్వి యెల్ల పోశెట్టి మాట్లాడుతూ... నా యొక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన కళాకారులందరికి ఆత్మీయ సభ్యులందరికీ వ్యాపారుల సంఘం సభ్యులందరికీ పేరుపేరునా హృదయపూర్వక కళాభివందనములు కృతజ్ఞతలు తెలియజేశారు.

### గ్రేవ్, పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తుతో

# నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి

**వేములవాడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా**

**పటిష్ట భద్రత, ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలి**

**వేములవాడ సబ్ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించిన రాజన్న**

**జోన్-3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్**




**వాస్తవం : వేములవాడ**

వేములవాడ సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని జోన్-3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయానికి సంబంధించిన ఇన్ఫర్మేషన్ బుక్,క్రైమ్ రికార్డులు,వివిధ రిజిస్టర్లను పరిశీలించారు.సబ్ డివిజన్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల సీడీ ఫైళ్లు, పెండింగ్ మరియు ట్రయల్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నాణ్యమైన (క్వాలిటీ) దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించాలని సూచించారు. ప్రతి కేసులోఎస్ ఓ పి ప్రకారం దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కార్యాలయంలో 5 ఎస్ అమలును పరిశీలించిన డీఐజీ ఫైళ్లను క్రమబద్ధంగా నిర్వహిస్తూ 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో శాంతిభద్రతల పరిరక్షణకు సీఐలు, ఎస్ఐలు నిరంతరం చర్యలు చేపట్టాలని, పోలీస్ స్టేషన్లను తరచుగా తనిఖీ చేస్తూ సిబ్బంది పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన వేములవాడకు శ్రీ రాజరాజేశ్వర స్వామి దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో గస్తీని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న డీఐజీకి ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.డిఐజి సన్ ప్రీత్ సింగ్ వెంట ఎస్పీ మహేష్ బి గితే, డిఎస్పీ శ్రీనివాసులు, సిఐ లు, ఎస్ఐ లు ఉన్నారు.

# జయశంకర్ సార్‌కు

# ఘన నివాళులర్పించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

**వాస్తవం జూబ్లీహిల్స్**



తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత ఉద్యమ శిఖరం, తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని పీవీ నరసింహారావు హాల్‌లో ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ తో పాటు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన అపూర్వ సేవలను స్మరించుకున్నారు.

# తెలంగాణ జాతిపిత ఉద్యమ కెరటం

**జయశంకర్ ఐసిడిఎస్ సూపర్ వైజర్ అంజమ్మ**



**వాస్తవం : వేములవాడ**

తెలంగాణ సిద్ధాంతకర్త స్వరాష్ట్ర భావజాల వ్యాప్తి కోసం జీవితాన్ని అర్పించిన ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ, జయంతి సందర్భంగా వేములవాడ పట్టణంలో న్యూ అర్బన్ కాలని పాఠశాలలో గురువారం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ అంజమ్మ మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమ నేతగా,రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించి,నీళ్లు,నిధులు, నియామకాలలో తెలంగాణ నష్టపోయిందంటూ పలు సమావేశాలలో తన గొంతుక వినిపించిన తెలంగాణ ఉద్యమ మాస్టారు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ మార్గదర్శకుడని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత,అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల,పులి శారద,విద్యార్థులు పాల్గొన్నారు.

# దాబాల్లో ఎక్సైజ్ దాడులు



**వాస్తవం : హుస్నాబాద్**

అనుమతి లేకుండా మద్యం విక్రయాలు జరుపుతున్న హుస్నాబాద్ పట్టణంలోని దాబాలు, రెస్టారెంట్లపై ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ దాబాల్లో మద్యం సేవించేందుకు అనుమతిస్తున్న రాజేశ్ దాబా,మారుతి దాబా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.అలాగే పట్టణంలోని అన్ని దాబాలు, రెస్టారెంట్ల నిర్వాహకులకు మద్యం విక్రయించరాదని, ప్రాంగణంలో మద్యం సేవకు అనుమతించకూడదని నోటీసులు జారీ చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ మద్యం సేవపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ దామోదర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుళ్లు భాస్కర్, రేణుక పాల్గొన్నారు.

# ఘనంగా జయశంకర్, గద్దర్‌కి నివాళులు



**వాస్తవం :అందోలు:** తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ సార్ జయంతి, ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా జోగిపేట పట్టణంలో హనుమాన్ చౌరస్తా వద్ద ప్రజా సంఘాల నాయకులు టిఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసి మాజీ చైర్మన్ డి బి నాగభూషణం, మాల మహానాడు నాయకులు మాల్లేశం , నాయకులు కరుణకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జయ శంకర్ అని తెలంగాణ సాధనతోపాటు ప్రజల కోసం తన గళంతో ఎన్నో గేయాలు పాడి ప్రజల హృదయల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడు గద్దర్ అని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, సార శ్రీధర్చి , దీన బందావ్ తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు కొనసాగించాలి




వాస్తవం : హుస్నాబాద్


స్ఫూర్తి ప్రదాత, మహోన్నత విద్యావేత్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని హుస్నాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సామాజిక న్యాయం, ప్రాంతీయ సమానత్వం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. జయశంకర్ చూపిన ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, గాదెపాక రవీందర్, చెన్నబోయిన అనూష, బూరుగు లత, రజిత, తిరుపతి, బొలిశెట్టి రాజు, మంజుల, వరప్రసాద్, కిరణ్ ప్రసాద్, స్వరూప, కో-ఆప్షన్ సభ్యులు హసన్, సరోజన, మున్సిపల్ అధికారులు శంకర్, రవికుమార్, ప్రదీప్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవం కథనానికి స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్

**పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు పూర్తి**

**భద్రతపై ప్రత్యేక చర్యలు**








వాస్తవం : వర్ధన్నపేట

వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని వాస్తవం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆసుపత్రి యాజమాన్యం వెంటనే స్పందించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు నిష్క్రియంగా ఉన్న సీసీ కెమెరాలను మరమ్మతు చేయించి తిరిగి పనిచేసేలా చర్యలు చేపట్టారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, ప్రధాన కారిడార్లు తదితర ప్రాంతాల్లో ఉన్న కెమెరాలను సాంకేతిక నిపుణులతో పరిశీలించి లోపాలను సరిచేశారు. ప్రస్తుతం కెమెరాలు సక్రమంగా పనిచేస్తుండటంతో రోగుల భద్రత, వైద్య సిబ్బంది విధుల పర్యవేక్షణ మరింత మెరుగుపడనుంది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ, "ఆసుపత్రి భద్రతకు సీసీ కెమెరాలు కీలకం. భవిష్యత్తులో ఎలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం" అని తెలిపారు. ప్రజలు, రోగుల బంధువులు వాస్తవం దినపత్రిక ప్రచురించిన కథనానికి స్పందించి వెంటనే చర్యలు తీసుకున్న ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందిస్తూ, ఇకపై కూడా సీసీ కెమెరాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కోరుతున్నారు.

# జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**చిట్కుల్ గ్రామంలో అంగరంగ వైభవంగా బోనాల పండుగ..**

**ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు.. గ్రామ ప్రజలు**



వాస్తవం : పటాన్చెరు

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలనీ పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన గ్రామ దేవతల బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఎమ్మెల్యే జీఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ వెంకటేష్, ఆంజనేయులు, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, మేరాజ్ ఖాన్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

**హాజరైన యూనియన్ నాయకులు అశోక్, దస్తగిరి**



వాస్తవం : పటాన్చెరు

మహిళలకు ఉచిత బస్సుతో ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లోరౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పటాన్చెరువు నుండి ఆటో యూనియన్ నాయకులు జంపాల అశోక్, (చోటు)దస్తగిరీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ చలాన్ల భారం తగ్గించడంతోపాటు, డ్రైవర్లకు ఆరోగ్య భీమా, ప్రమాద బీమా, పెన్షన్ వంటి సామాజిక భద్రత పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టే ప్రతి ఉద్యమానికి బి.ఆర్.ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. డ్రైవర్ల జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ నెరవేర్చకపోతే 23 అర్ధరాత్రి నుంచి ఆటో డ్రైవర్ల నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ( ఎం ఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హనుమేష్,ఆటో జేఏసీ నాయకులు మారయ్య, సత్తిరెడ్డి, ఎస్. దయానంద్,పెంటయ్య,ఓమర్ ఖాన్,ముఖేష్, రవిశంకర్,పటాన్చెరు నాయకులు జంపాలా అశోక్ ,దస్తగిరిలు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ డా జయశంకర్ జన్మదిన వేడుక



వాస్తవం : స్టేట్ కల్చరల్ బ్యూరో :

కరీంనగర్ ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు వొగేటి బిందు ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ డాక్టర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వొగేటి బిందు మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతగానో కృషి చేశారని ఆయన ఆలోచనలు ఆయన చూపిన బాట లో ఉద్యమ కారులం ప్రతి ఒక్కరం అనేక కార్యక్రమాలను నిర్వహించామని,తెలంగాణ రాష్ట్రం కోసం చాలా శ్రమించారని జయశంకర్ సార్ ఉద్యమ కారులందరికి ఆదర్శప్రాయుడు అని ఆయన ఆశలను సాధిస్తామని ఉద్యమకారులందరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నగర ఉపాధ్యక్షురాలు గడ్డం లత. జిల్లెల్ల గ్రామ సర్పంచ్ దుబ్బాక రజిత ,తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ గంగిపల్లి సతీష్. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దపల్లి మధుసూదన్. ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి మంద వెంకన్న గౌడ్. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోశాధికారి గుమ్మడి శ్రీధర్ పటేల్ ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

**డ్రిప్ ఏర్పాటు, మొక్కల నాటే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి**

**రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**అధికారులతో సమీక్ష**



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్దేశించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని, డ్రిప్ సౌకర్యం కల్పించడం, మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రి-యునిక్ కంపెనీ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో గురువారం ఆయిల్ పామ్ సాగు పురోగతి, లక్ష్యాన్ని చేరుకోవడంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఆయిల్ పామ్ మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం సకాలంలో అందేలా ఉద్యాన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అదేవిధంగా, డ్రిప్ ఏర్పాటు, మొక్కల సరఫరా ప్రక్రియల్లో జాప్యం లేకుండా సంబంధిత కంపెనీ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి ఆర్ శరత్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్ సేఫ్టీ నిర్లక్ష్యాలపై విచారణ చేపట్టాలి

**భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్**



**వాస్తవం : సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనల ఉల్లంఘనపై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ శాఖ అధికారికి భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ గురువారం వినతి పత్రం సమర్పించారు .ఈ సందర్భంగా దొబ్బల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ....ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు చట్టబద్ధమైన ఫైర్ నిబంధనలు లేకుండానే నిర్వహించబడుతున్నాయని, మరికొన్ని విద్యాసంస్థలు నకిలీ లేదా తప్పుడు ఫైర్ ఎన్ ఓ సి పత్రాలను వినియోగిస్తున్నాయనే ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. విద్యార్థుల ప్రాణ భద్రత అత్యంత ముఖ్యమైన అంశమని, భద్రతా ప్రమాణాలను పాటించకుండా విద్యాసంస్థలను నిర్వహించడం తీవ్రమైన నిర్లక్ష్యమని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఫైర్ ఎన్ఓసి లేకుండా నడుస్తున్న సంస్థలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే నకిలీ లేదా ఫోర్జరీ చేసిన ఫైర్ ఎన్ ఓ సి పత్రాలను వినియోగించిన యాజమాన్యాలు, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు ఎలాంటి రాజీ పడకుండా పారదర్శక విచారణ నిర్వహించి, దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, ప్రణయ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగంపై విచారణ

**విచారణ పేరుతో స్థలాలను పరిశీలించారు గ్రామస్తుల ఆరోపణ**





**వాస్తవం : చిగురుమామిడి**

జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి ఆదేశాల మేరకు రేకొండ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం,అక్రమాలపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో చిగురుమామిడి ఎంపీఓ కిరణ్ కుమార్ గురువారం రేకొండలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు.విచారణలో భాగంగా ఫిర్యాదులో పేర్కొన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం సమీపంలోని బోరు,చెరువు కట్ట వద్ద మొక్కల ధ్వంసం కాలిన చెట్లు తొలగింపు పేరుతో జరిగిన పనులను పరిశీలించారు. ఫిర్యాదులో పేర్కొన్న గ్రామ పంచాయతీ తీర్మానాలు,బిల్లులు, ఓచర్లు,మెజర్మెంట్ ఎంబి బుక్స్,బ్యాంకు లావాదేవీలు ఇండ్ల నిర్మాణాల అనుమతి పత్రాలు తదితర కీలక రికార్డులను అధికారులు పరిశీలించకుండానే విచారణ ముగించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.దీనిపై ఎంపీఓ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై విచారణ చేపట్టి సంబంధిత నివేదికను పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులకు అందజేశామన్నారు.

## ఉద్యమానికే జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్

**సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**




**వాస్తవం : రాజేంద్రనగర్**

తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా నిరాడంబర జీవితాన్ని గడిపిన ప్రొఫెసర్ జయశంకర్ జాతికి అందించిన సేవలు చిరస్మరణీయమని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కే. జయశంకర్ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జోనల్ కమిషనర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన దిశా నిర్దేశం,నిబద్ధత,త్యాగస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.మనమందరం ప్రజాసేవ పట్ల అంకిత భావంతో పనిచేయడమే ఆయనకు అసలైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డిసి మల్లయ్య, పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం ఎంపీ ఈటెల రాజేందర్



**వాస్తవం : రాజేంద్రనగర్**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ సిద్ధాంతకర్తగా విద్యావేత్తగా ప్రొఫెసర్ జయశంకర్ జాతికి అందించిన సేవలు చిరస్మరణీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ 92 వ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆయన చిత్రపటానికి ఎంపీ ఈటల రాజేందర్, బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమం పట్ల వ్యక్తపరిచిన అచంచలమైన అంకితభావం, విద్య సామాజిక న్యాయం ఆయన జీవితకాల నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఆయన మార్గదర్శకత్వం, దార్శనికత మనందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వై. శ్రీధర్, కొమురయ్య, ఎస్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్టుల సంక్షేమ సంఘం
Regd No. 914/2015
JSS
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH TRADE UNION



మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# డిజిటల్ పేమెంట్స్ వాత

**ఇక యూపీఐ చార్జీల మోత**
**జీరో ఎండీఆర్ పాలసీకి కేంద్రంలోని మోదీ సర్కార్ స్వస్తి**
**బిల్లుకు లోక్‌సభ ఆమోదం**
**లావాదేవీ 2 వేలు దాటితే భారమే**
**అంతిమంగా కస్టమర్లపైనే భారం..**
**నిపుణుల వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్టు 6 :** పాల ప్యాకెట్ కొనుగోలు నుంచి నిత్యం ఎలాంటి పేమెంట్స్ అయినా ఫోన్ ద్వారానే చెల్లిస్తున్నాం. ఒక్క రూపాయి నుంచి లక్షల రూపాయల వరకూ యూపీఐ ద్వారానే లావాదేవీలు నిర్వహిస్తున్నాం. దీని కోసం గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, భీమ్ తదితర యాప్స్ వాడకం జీవితంలో ఒక భాగంగా మారింది. అయితే, మొన్నటి వరకూ ఫ్రీగా జరిగిన ఈ లావాదేవీలు ఇకపై అలా ఉండబోవు. ఇన్నాళ్లూ డిజిటల్ పేమెంట్స్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ వచ్చిన మోదీ సర్కార్.. ఇక చార్జీల వాతకు తెరతీసింది. యూపీఐ లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)'ను విధిస్తూ రూపొందించిన యూపీఐ ట్రాన్సాక్షన్ చార్జీల బిల్లుకు గురువారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. తద్వారా యూపీఐ పేమెంట్స్, రూపే డెబిట్ కార్డు పేమెంట్స్‌పై చార్జీలు వసూలు చేసుకొనే అధికారం బ్యాంకులకు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లకు (పీఎస్పీ) ఇస్తూ కేంద్రం తలుపులు బార్లా తెరిచింది. ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. అంతిమంగా సామాన్యుడికే పోటు లోక్‌సభలో ఆమోదం పొందిన తాజా బిల్లు ప్రకారం.. ఎంత మేరకు ఎండీఆర్ చార్జీలు విధిస్తారన్న దానిపై ఇప్పుడే స్పష్టత లేకపోయినప్పటికీ, రూ.2 వేలకు మించిన లావాదేవీలపై 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్‌ను విధించే అవకాశం ఉన్నదని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఈ చార్జీల భారం వ్యాపారులపైనే ఉండనున్నట్టు ప్రభుత్వవర్గాలు చెప్తున్నప్పటికీ, అంతిమంగా కొనుగోలు దారులపైనే భారం పడుతుందన్న వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఉదాహరణకు.. ఓ కస్టమర్ రూ.2 వేల విలువైన వస్తువును ఓ షాపులో కొన్నాడు అనుకొందాం. రూపే డెబిట్ కార్డు లేదా యూపీఐ యాప్ ద్వారా రుసుం చెల్లించాడు. జీరో ఎండీఆర్ పాలసీ వల్ల ఇప్పటివరకూ ఈ పేమెంట్‌ను కస్టమర్‌కు చెందిన బ్యాంక్, వ్యాపారికి చెందిన బ్యాంక్‌లతోపాటు పీఎస్పీలు ఉచితంగానే ప్రాసెస్ చేసేవి. దీనివల్ల సదరు వస్తువును అమ్మిన వ్యాపారి ఖాతాలో రూ.2,000 జమ అయ్యేది. అయితే జీరో ఎండీఆర్ పాలసీ రద్దు కాబోతున్న నేపథ్యంలో.. కస్టమర్ పేమెంట్‌ను ప్రాసెస్ చేసినందుకు బ్యాంకులు, పీఎస్పీలు వ్యాపారుల దగ్గర ఇకపై ఛార్జీలను వసూలు చేస్తాయి. దీనివల్ల వ్యాపారి ఖాతాలో రూ. 2 వేల కంటే తక్కువ జమవుతుంది. దీంతో తాను నష్టపోయే సదరు చార్జీ మొత్తాన్ని వ్యాపారులు.. కస్టమర్ దగ్గరే వసూలు చేసే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. తాము కస్టమర్ల పేమెంట్స్‌పై చార్జీలు వేయట్లేదని ప్రభుత్వ పెద్దలు చెప్తున్నప్పటికీ.. ప్రాసెసింగ్ లేదా అదనపు చార్జీల పేరిటనో, వస్తువు ధరను పెంచో వ్యాపారులు కొనుగోలుదారుల వద్దే ఆ ఛార్జీలను రాబడుతారని హెచ్చరిస్తున్నారు. అలా అంతిమంగా సామాన్యుడిపైనే ఆర్థికపోటు పడొచ్చని చెప్తున్నారు. పైగా దీని వల్ల యూపీఐ లావాదేవీలు తగ్గుముఖం పట్టడంతో పాటు చివరకు ఆన్‌లైన్ లావాదేవీలను వ్యాపారులు నిరాకరించే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు.



**ఎవరో ఒకరు భరించాలి : ఆర్బీఐ గవర్నర్**

యూపీఐ లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్ ' విధించే అంశంపై బుధవారం ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయాలంటే దాని నిర్వహణ వ్యయాన్ని ఎవరో ఒకరు భరించాల్సిందేనని, అయితే ఆ భారం నేరుగా సాధారణ వినియోగదారులపైనే పడుతుందని ఇప్పుడే చెప్పలేమని ఆయన పేర్కొన్నారు. 'వ్యవస్థ నిర్వహణకు ఖర్చు తప్పదు. ఆ ఖర్చును ఎవరో ఒకరు చెల్లించాల్సి ఉంటుంది. కానీ అది సాధారణ వినియోగదారుడే చెల్లిస్తాడని చెప్పలేం. పరోక్షంగా ఆర్థిక వ్యవస్థలోనే ఆ వ్యయం భరించే అవకాశం కూడా ఉంటుంది' అని మల్హోత్రా వివరించారు. అయితే, అంతిమంగా వినియోగదారుల నుంచి సదరు చార్జీలను వ్యాపారులు వసూలు చేస్తారని ప్రతిపక్ష నాయకులు అంటున్నారు. గత నెలలోనే రూ.29.88 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగాయి. నిరుడు జూలై నెలలో జరిగిన లావాదేవీల విలువతో పోలిస్తే ఇది 19 శాతం ఎక్కువ.

**ఏమిటీ ఎండీఆర్?**

కొనుగోలుదారులు నిత్యం రకరకాల దుకాణాలు, షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు, మరెన్నో చోట్ల చేసే ఆన్‌లైన్ (యూపీఐ) చెల్లింపులను బ్యాంకులు, పీఎస్పీలు ప్రాసెస్ చేస్తాయి. ఇందుకుగాను ఆయా వ్యాపారులు వాటికి చెల్లించే ఫీజునే మర్చంట్ డిస్కౌంట్ రేట్ లేదా ఎండీఆర్ అంటారు. ఇప్పటివరకూ ఇది జీరోగా ఉం ది. తాజా బిల్లుతో ఎండీఆర్ ఫీజు రాబోతున్నది.

# పంద్రాగస్టు నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**సీఎం చేతుల మీదుగా సంగారెడ్డి లో ప్రారంభం**
**రాష్ట్రవ్యాప్తంగా 1.05కోట్ల కొత్త రేషన్ కార్డులు సిద్ధం**
**మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**వాస్తవం : హైదరాబాద్, ఆగస్టు 6:**



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కొత్తగా మంజూరైన లామినేటెడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడి ఎస్) రేషన్ కార్డులను ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక మెమో జారీ చేశారు. ఈ విషయమై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విడుదల చేసిన ఒక ప్రకటనలో రేషన్ కార్డుల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోందని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు.

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా..**

సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ప్రారంభోత్సవం నిర్వహించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఓవి రమేష్ బాబుకి వినతి**
**బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి**

**వాస్తవం : అంతర్గాం, ఆగస్టు, 06**

పెద్దపెల్లి జిల్లా ,అంతర్గాం మండలంలోని గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి , హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఓ, వి రమేష్ బాబు సంబంధిత కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రానికి అత్యంత కీలకమైన ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందుతున్నప్పటికీ, ప్రాజెక్టు వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడం విచారకరమన్నారు. భారీ జలాశయాన్ని సందర్శించేందుకు ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నప్పటికీ, వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో ప్రాజెక్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది కూడా విద్యుత్ దీపాల లేమితో ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. అంతేకాకుండా ప్రాజెక్టు ప్రాంతంలో మంచినీటి సౌకర్యం లేకపోవడం వల్ల నీటి మధ్యలో ఉన్నప్పటికీ తాగునీరు దొరకని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారి సరిగా లేకపోవడంతో ఎల్లంపల్లి, ముర్మూర్ ఆర్అండ్ఆర్ కాలనీల వీధుల గుండా మట్టి రహదారిలో ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ప్రాజెక్టు వరకు మెరుగైన ప్రధాన రహదారిని నిర్మిస్తే ఏడాది పొడవునా పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చి



ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అలాగే ప్రాజెక్టు స్పిల్‌వే, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి అలంకరణ చేస్తే గేట్లు ఎత్తిన సమ యంలో ప్రాజెక్టు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి ప్ర ధాన నీటి వనరైన ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ప్రధాన రహదారి, వీధి దీపాలు, మంచి నీటి సౌకర్యం, విద్యుత్ అలంకరణ వంటి మౌలిక వసతులను తక్షణమే కల్పించాలని ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల అధ్యక్షులు బోడుకుంటి సుభాష్, పాలకుర్తి మండల అధ్యక్షులు మెరుగు నరేష్ గౌడ్, జనగామ గ్రామ అధ్యక్షులు గుండబోయిన భూమయ్య మరియు జక్కుల పద్మ, యేసు లత,సిలారపు కళ్యాణ్,తరుణ్, నాగరాజు, సంతోష్,అరవింద్, తిరుపతి, బాలు తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్, గద్దర్లకు సీఎం ఘనంగా నివాళులు



**వాస్తవం : హైదరాబాద్,ఆగస్టు 06:**

తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి గద్దర్ ప్రాణం పోసిన మహనీయుడని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నిత్యం రగిలించిన అసామాన్య ప్రజాకవి అని కొనియాడారు. గద్దర్ వర్ధంతి నేపథ్యంలో ఆయన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. అదేవిధంగా ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాంతం శ్రమించిన మహనీయుడు, ఉద్యమ చిరునామా సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గౌరవంగా స్మరించుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజా నౌక కవి, ఉద్యమకారుడు గద్దర్ వర్ధం తులను సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా నిర్వహించారు.గద్దర్‌తో పాటు..ప్రొఫెసర్ జయ శంకర్‌కు తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పేద కుటుంబంలో జన్మించిన గద్దర్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించినప్పటికీ.. ఉన్నత ఉద్యోగాల కోసం ప్రయత్నించకుండా.. సమాజంలోని పేద, బడుగు, బలహీనవర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ప్రతి మనిషికీ కూడు, గూడు దక్కాలనే మహోన్నత లక్ష్యంతో జీవితాంతం పాటనే ఆయుధంగా మార్చుకుని ప్రజల్లో చైతన్యం నిం పారని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు అంకితభావంతో పనిచేశారని అన్నారు.

# ప్రజల ఆకాంక్షలే పరమావధిగా ప్రజాపాలన

**రూ.6.74 కోట్లతో**
**అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**వాస్తవం- ఖమ్మం ప్రతినిధి**

ఖమ్మంజిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విస్తృతంగా పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులతో కలిసి పర్యటించిన మంత్రి రూ.6.74కోట్ల అంచనావ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, శంకుస్థాపనలు చేశారు.రూ.1.76 కోట్లతో రాజుపేటబజార్ గ్రామం వద్ద ఈశ్వరమాదారం నుంచి భద్రుతండా వరకు బీటీరోడ్డుకు శంకుస్థాపన, రూ.50 లక్షలతో భద్రుతండా రోడ్డు నుంచి తాళ్ల గడ్డ తండా వరకు బీటీరోడ్డు శంకు స్థాపన,రూ.3.20 కోట్లతో చౌటుపల్లి గ్రామంలో హైలెవెల్ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.1.28 కోట్లతో లింగారం తండాలో ఆర్అండ్‌బీ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు చౌటుపల్లిని దత్తత తీసుకుని పలు అభివృద్ధిపనులు చేసినట్లు ఈ సందర్భంగా పొంగులేటి గుర్తు చేశారు. మిగిలిన అన్ని పనులనూ పూర్తిచేసే బాధ్యత నాదేనని హామీ ఇచ్చి, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లింగారం తండాలోనే రూ.5.45 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. తన పాలేరు నియోజకవర్గం పరిధిలో భూమి రీ-సర్వే ప్రక్రియ వేగంగా జరుగుతోందని, త్వరలో నకిలీ పాసుపుస్తకాలు రద్దుచేసి,అర్హులైన భూయజమానులకు న్యాయబద్ధమైన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని మంత్రి పొంగొలేటి ఈ సందర్భంగా పంరకటించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడమే తమ ప్రజాప్రభుత్వ ముఖ్య లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. లింగారంతండాలో స్థానిక రైతులతో ముచ్చటించి, వ్యవసాయ పరిస్థితులు, పంటల పురోగతిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, ఆర్. అండ్.బి అధికారులు, లింగారం తండా సర్పంచ్, ఉప సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కారుకు ప్రమాదం

**టోల్‌గేట్ వద్ద నిలిచి ఉన్న కారును ఢీకొట్టిన లారీ**

**వాస్తవం - ఖమ్మం ప్రతినిధి**



భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్.తెల్లం వెంకట్రావు హైదరాబాద్‌కు వెళ్తుండగా గురువారం సాయంఅంత్రం పతంగి టోల్‌గేట్ సమీపంలో ఆయన కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల సమాచారం ప్రకారం, టోల్‌గేట్ వద్ద నిలిచి ఉన్న ఎమ్మె ల్యే కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఎమ్మెల్యే తెల్లం సురక్షితంగా బయటపడినప్పటికీ, ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో ఆయన షాక్‌తో స్వల్ప అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే వాహనం ఒక వైపు దెబ్బతినగా, పెను ప్రమాదం తృటిలో తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో ఎమ్మెల్యే అనుచరులు,నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ఆందోళన చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కారణాలు, వివరాలు తెలియాల్సి ఉంది.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
Editor : MANASANI KRISHNA REDDY